بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 05 December 2025 (Telugu)

# తబూక్ యుద్ధం మరియు కొన్ని సరాయాల నేపథ్యంలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ మూమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 05.12.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

గత ఖుత్బాలో హజ్రత్ కఅబ్ బిన్ మాలిక్ మరియు మరికొందరు అనుచరుల తబూక్ యుద్ధంలో వెనుకబడిపోవడం గురించి అలాగే ఆ వెనుకబడిన వారి పట్ల దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వససల్లం గారి ఆగ్రహం గురించి ప్రస్తావించబడింది. ఈ సందర్భంలో హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (ర.జి.) జమాఅత్‌నకు ఉపదేశమిస్తూ ఇట్లన్నారు: ముగ్గురు విశ్వాసులు తబూక్ యుద్ధంలో పాల్గొనలేదని హదీసులలో ప్రస్తావన గలదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వససల్లం వారితో సంబంధాన్ని తెంచుకోమని ఆజ్ఞాపించినప్పుడు, మదీనా వాసులలో కూడా ఎవరికీ వారితో మాట్లాడే ధైర్యం లేకుండెను. వారిట్లు హితవు పలికారు. ఇక్కడ ఖాదియాన్‌లో శిక్షగా మాట్లాడటం నిషేధించబడిన వ్యక్తులు అహ్మదీయుల గృహాలకు కూడా వెళ్లడం నేను చూశాను. పక్కింటివాళ్ళు నిద్రపోతున్నారో ఏమో వాళ్లకి తెలియనే తెలియదు. అయితే మదీనాలో ఏ ఒక్క దాంబికుడు కూడా వారితో మాట్లాడటానికి సాహసించలేదు. హుజూరె అన్వర్ ఇట్లు వివరించారు. 1936లో కొన్ని అల్లర్లు చెలరేగినప్పుడు హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (ర.జి.) ఈ విషయం చెప్పవలసి వచ్చింది.

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (ర.జి.) మరొక చోట ఇట్లన్నారు: కఅబ్ బిన్ మాలిక్ గారి సంఘటన ఎంతో గొప్ప గుణపాఠం నేర్పుతుంది. ఆయన (ర.జి.) అన్ని యుద్ధాలలోనూ దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వససల్లంతో పాటు ఉండిరి. మక్కా విజయంలో కూడా ఆయన (స.అ.స)తో కలిసి ఉండిరి. కానీ తబూక్ యుద్ధంలో బద్ధకం వల్ల వెనుకబడిపోయారు. దైవ ప్రవక్త (స.అ.స) వారికి అంత కఠినమైన శిక్ష విధించారు. కానీ హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (ర.జి.) ఇలా తెలిపారు. ఈ రోజుల్లోని ప్రజలు, ఏదైనా ప్రశ్నించబడితే లేదా జవాబు అడిగితే, వారు తమ సేవలను పరిగణలోకి తీసుకోలేదని, తమను గౌరవించలేదని అంటారు. వ్యవస్థాపన వేరు మరియు పని చేయడం వేరని గుర్తుంచుకోవాలి. వ్యవస్థను నిలబెట్టడానికి, ఎంతటి వారైనా సరే తప్పు చేసిన వారిని ప్రశ్నించడం జరుగుతుంది. కాబట్టి, దేవుని

ఆజ్ఞకు లోబడి, షైతాన్‌ను తరిమికొట్టడానికి ఉపయోగపడే ప్రయత్నాలు ధర్మం కోసం చేయండి, కానీ మీ ప్రశంసల కోసం మాత్రం అస్సలు చేయవద్దు. పని చేసిన తర్వాత, మా తప్పుల గురించి మమ్మల్ని ప్రశ్నించరని అనుకోవద్దు. ఇంకా దేవుడిపై ఉపకారం చెయ్యకండి అజాగ్రత్తగా ఉండకండి. అన్ని మార్గాల ద్వారా ఇస్లాంకు సేవ చేయండి. ఉపకారం చేయవద్దు, సేవ చేయండి. అల్లాహ్‌ను సంతోష పెట్టాలనే ఉద్దేశ్యం మాత్రమే కలిగి ఉండాలి.

హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా ఇలా అన్నారు: తబూక్ యుద్ధ యాత్ర ఎంత జ్ఞానవంతమైనది మరియు శుభప్రదమైనదనగా, ముస్లింల భయం మొత్తం అరబ్బులో వ్యాపించింది మరియు అతి కొద్ది కాలంలోనే ఇస్లాం జెండా మొత్తం అరబ్బుపై రెపరెపలాడింది. దీని గురించి హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (ర.జి.) ఇలా విశ్లేషించారు. తబూక్ నుండి తిరిగి వచ్చిన తర్వాత, తాయిఫ్ ప్రజలు కూడా విధేయత చూపారు, ఆ తర్వాత అరబ్బులోని వివిధ తెగలు ఒక్కొక్కటిగా వచ్చి ఇస్లామి ప్రభుత్వంలో చేరడానికి అనుమతి అడిగారు. ఇలా మొత్తం అరబ్బుపై ఇస్లాం జెండా ఎగురవేయబడింది.

తబూక్ నుండి తిరిగి వచ్చిన తర్వాత హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (ర.జి.) నాయకత్వంలో ఒక సైనిక దళం (సరయ్యా) కూడా పంపబడింది. దీనిని సరయ్యా ఖాలిద్ బిన్ వలీద్ అని అంటారు. దీనిని నజ్రాన్‌లోని ఒక భాగం అయిన బనూ హారిస్ వైపు పంపారు. ఒక కథనం ప్రకారం ఈ సరయ్యా రబీ ఉల్ అవ్వల్ 10వ హిజ్రీ సం॥లో జరిగింది. ఈ సరయ్యాకు బయలుదేరేటప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఖాలిద్ బిన్ వలీద్ (ర.జి.)ను ఈ విధంగా ఆదేశించారు. ఆ తెగపై దాడి చేసే ముందు మూడు సార్లు వారిని ఇస్లాం వైపు ఆహ్వానించండి, వారు అంగీకరించకపోతేనే వారితో పోరాడండి. హజ్రత్ ఖాలిద్ (ర.జి.) ఈ ఆదేశాన్ని పాటించారు. తద్వారా ఆ ప్రజలందరూ ముస్లింలయ్యారు. హజ్రత్ ఖాలిద్ (ర.జి.) దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారికి ఒక లేఖ పంపారు, అందులో ఆయన (ర.జి.) ఇలా వ్రాశారు. మీ ఆదేశం మేరకు మేము వారికి ఇస్లాం సందేశాన్ని అందించాము. కావున వారు ఇస్లాంను అంగీకరించారు. ఇప్పుడు నేను వారి మధ్య నివసిస్తూ వారికి మతపరమైన ఆజ్ఞలు మరియు నిషేధాలను బోధిస్తున్నాను. మీ వైపు నుండి వచ్చే తదుపరి ఆజ్ఞ ప్రకారం నేను వ్యవహరిస్తాను. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ లేఖకు జవాబిస్తూ ఇలా ఆదేశించారు. బనూ హారిస్ ఇస్లాంను అంగీకరించారని మీ లేఖ ద్వారా తెలిసింది. కనుక మీరు వారికి దైవ ప్రతిఫలం గురించి శుభవార్త ఇవ్వండి మరియు దైవ శిక్షల గురించి హెచ్చరించండి, అనంతరం వారిలో నుండి కొంతమందిని తీసుకుని మీరు మా దగ్గరికి రండి. హజ్రత్ ఖాలిద్ (ర.జి.) వారిలో కొంతమందిని తీసుకుని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి హాజరయ్యారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఖైస్ బిన్ హుసైన్‌ను బనూ హారిస్‌కు నాయకుడిగా నియమించారు. షవ్వాల్ లేదా జీ' ఖాదా నెల చివరలో వారిని తిరిగి తమ ప్రాంతానికి పంపించారు. వారు తిరిగి వెళ్ళిపోయిన నాలుగు నెలల తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కన్నుమూశారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి చివరి యుద్ధం తబూక్ యుద్ధం, ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం పంపిన చివరి సైనిక దళం (సరయ్యా) ఉసామా (ర.జి.) సైన్యం. ఉసామా (ర.జి.) సైన్యం కంటే ముందు ఒక సైన్యం వెళ్లి ఉండెను. దీనికి సంబంధించి, బుఖారీలో హజ్రత్ అనస్ (ర.జి.) ద్వారా ఒక కథనం ఇట్లున్నది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జైద్ (ర.జి.), హజ్రత్ జాఫర్ (ర.జి.), మరియు హజ్రత్ అబ్దుల్లా బిన్ రవాహా (ర.జి.) లు అమరవీరులైన వార్తను ప్రజలకు అందించారు, అప్పుడు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం కళ్ళ నుండి కన్నీళ్లు ప్రవహించాయి. ఆ తర్వాత ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లన్నారు. అప్పుడు అల్లాహ్ ఖడ్గాలలో ఒక ఖడ్గం అయిన ఖాలిద్ బిన్ వలీద్ (ర.జి.) ఇస్లాం జెండాను పట్టుకున్నారు. తదనంతరం అల్లాహ్ ఆయన (ర.జి.) చేతి ద్వారా ముస్లింలకు విజయాన్ని ప్రసాదించాడు.

హజ్జతుల్ విదా (చివరి హజ్) నుండి తిరిగి వచ్చిన తర్వాత, ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు చేరుకున్నప్పుడు, దక్షిణ దిశ నుండి ముస్లింలకు ఎటువంటి ప్రమాదం లేదు, కానీ ఉత్తరం వైపు నుండి అనగా రోమన్ల నుండి ఇంకా ప్రమాదం పొంచి ఉండేది, ఎందుకనగా ఆ క్రైస్తవులు ఇప్పటికీ తమ శక్తిపై చాలా గర్వంగా ఉండేవారు. కావున ఎప్పుడైనా వారి వైపు నుండి దాడి జరిగే అవకాశముండెను. ఇదేవిధంగా, ఇప్పటికీ మౌతా యుద్ధ అమరవీరులకు ప్రతీకారం తీర్చుకోవడం మిగిలి ఉండెను. ఎందుకంటే ఆ యుద్ధంలో హజ్రత్ ఖాలిద్ (ర.జి.) నైపుణ్యం కారణంగా ముస్లిం సైన్యం తిరిగి మదీనాకు రావడంలో విజయవంతమైంది. హజ్ నుండి తిరిగి వచ్చి ఎక్కువ రోజులు గడవక ముందే ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఉసామా బిన్ జైద్ (ర.జి.) నాయకత్వంలో సిరియాపై దాడి చేయడానికి ఒక సైన్యం బయలు దేరాలని ఆజ్ఞాపించారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనారోగ్యం ప్రారంభం కావడానికి ముందే ప్రారంభమైన ఈ సైన్యం తయారీ, ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం మరణానికి రెండు రోజుల ముందు శనివారం నాడు పూర్తయింది. ఆయన సఫర్ నెల చివర్లో రోమన్లతో యుద్ధం చేయాలని ఆజ్ఞాపించారు. ఈ సందర్భంగా హజ్రత్ ఉసామా (ర.జి.) ను పిలిచి, మీ తండ్రి అమరులైన స్థలం వైపు బయలుదేరండి మరియు వారిని (శత్రువులను) తొక్కేయండని అన్నారు. నేను మిమ్మల్ని ఈ సైన్యానికి నాయకుడిగా నియమించాను. హజ్రత్ ఉసామా (ర.జి.) దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చేతితో కట్టిన జెండాను తీసుకుని బయలు దేరారు, దానిని హజ్రత్ బురైదా బిన్ హసీబ్ (ర.జి.) కు అప్పగించి, జుర్ఫ్ వద్ద సైన్యాన్ని సేకరించారు. జుర్ఫ్ అనేది మదీనాకు ఉత్తరాన మూడు మైళ్ళ దూరంలో ఉన్న ఒక ప్రదేశం. ముహాజిరీన్ మరియు అన్సార్లలోని గౌరవనీయులైన వారందరూ దాదాపు ఈ సైన్యంలో పాల్గొన్నారు. వారిలో హజ్రత్ అబూ బకర్ రజియల్లాహు అన్హు, హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు మొదలైన వారుండిరి. ఈ గొప్ప అనుచరులందరిపై హజ్రత్ ఉసామా (ర.జి.) ను నాయకుడిగా నియమించారు. ఇంత పెద్ద అనుచరులపై ఒక చిన్న బాలుడిని నాయకుడిగా నియమించారని ప్రజలు

పరస్పరం మాట్లాడు కోవడం ప్రారంభించారు. ఈ విషయం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వససల్లంనకు తెలిసినప్పుడు, ఆయన సల్లల్లాహు అలైహి వససల్లం చాలా ఆగ్రహం చెంది వేదికపైకి ఎక్కి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అందులో ఆయన హజ్రత్ ఉసామా రజియల్లాహు అన్‌హు మరియు ఆయన తండ్రి హజ్రత్ జైద్ రజియల్లాహు అన్‌హు గురించి చాలా గొప్ప విషయాలు చెప్పారు.

ఒకవైపు ఆయన సల్లల్లాహు అలైహి వససల్లం అనారోగ్యం పెరుగుతోంది, మరోవైపు ఉసామా (ర.జి.) సైన్యం ఏమైనా సరే బయలుదేరాలని ఆయన పట్టుబడుతుండిరి. ఆదివారం నాడు ఉసామా (ర.జి.) జుర్ఫ్ నుండి తిరిగి వచ్చి ఆయన్ను కలవడానికి హాజరైనారు. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వససల్లం మాట్లాడలేకపోయారు, కానీ రెండు చేతులు ఆకాశం వైపు పైకెత్తి, ఉసామా (ర.జి.) తలపై ఉంచారు. దాని ద్వారా ఆయన ఉసామా (ర.జి.) కోసం దుఆ చేస్తున్నట్లు అనిపించింది. సోమవారం ఆయన ఆరోగ్యం కొద్దిగా మెరుగుపడినప్పుడు ఉసామా (ర.జి.)తో ఇట్లన్నారు. అల్లాహ్ ఆశీస్సులతో బయలు దేరండి. ఉసామా (ర.జి.) తిరిగి సైన్యంలోకి వచ్చి, బయలు దేరాలని ఆజ్ఞాపించారు. అదే సమయంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వససల్లం చివరి క్షణాల గురించి హజ్రత్ ఉసామా (ర.జి.)కు సందేశం అందింది. ఆయన హజ్రత్ అబూ బకర్ (ర.జి.) మరియు హజ్రత్ ఉమర్ (ర.జి.) మొదలైన అనుచరులను వెంటబెట్టుకుని తిరిగి వచ్చారు. ఆ సమయంలో ఆయన మరణావస్థ స్థితిలో ఉండిరి. కొద్దిసేపటి తర్వాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వససల్లం కన్ను మూశారు.

హజ్రత్ అబూ బకర్ రజియల్లాహు అన్‌హు బైఅత్ ప్రమాణం తర్వాత హజ్రత్ ఉసామా (ర.జి.) సైన్యం బయలు దేరింది. ఈ సైన్యం సంఖ్య మూడు వేలు, ఇందులో వెయ్యి మంది గుర్రపు స్వారీ చేసేవారుండిరి. ఈ సైన్యం విజయవంతంగా తిరిగి వచ్చింది, శత్రువు చంపబడ్డాడు లేదా బందీ చేయబడ్డాడు. ముస్లింలలో ఎవరికీ ప్రాణ నష్టం జరగలేదు.

హుజూరె అన్వర్ ఇట్లన్నారు. ఈ యుద్ధాల ప్రస్తావన పరంపర ఇంతటితో ముగిసింది. భవిష్యత్తులో దైవ ప్రవక్త (స.అ.స) జీవిత చరిత్రలోని మరికొన్ని అంశాలను పరిశీలిస్తాను. ఇన్షా అల్లాహ్

ముగింపులో హుజూరె అన్వర్ ఇద్దరు దివంగతులు గౌ॥ అజీజుర్రహ్మాన్ ఖాలిద్ మురబ్బీ సిల్‌సిలా గారు, గౌ॥ ఏధీ హమీదీ ఇండోనేషియా గారి సద్గుణాలను ప్రస్తావించి వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించారు. అలాగే ఆ దివంగతుల క్షమాపణ, ఉన్నత స్థాయి అంతస్తుల కోసం దుఆ చేశారు.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ
اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ
وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَأْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ
وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -